# కమిషనరేట్ వ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

- మైనర్, ర్యాష్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి
- చట్టవ్యతిరేక కార్యకాలపాలకు అడ్డుకట్ట
- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జూలై 25: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇటీవల రాత్రివేళల్లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో బుధవారం రాత్రి పోలీసులు ముమ్మరంగా డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ వ్యాప్తంగా ఎక్కడికక్కడ పోలీసులు మోహరించి లారీ డ్రైవర్లు, బస్, కారు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మందుబాబులు కార్లు, ద్విచక్ర వాహనం నడుపుతూ పట్టుబడిన 55 మందిపై కేసులు నమోదు చేశారు. కొద్ది రోజులుగా విద్యార్థులు, మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేస్తూ.. ర్యాష్, మైనర్ డ్రైవర్లను పట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక నుంచి

తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులకు శిక్షార్హులు అవుతాయరన్నారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు గురించి అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్‌లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు విజబుల్ పోలీసింగ్ మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులను ఆదేశించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిళ్లగూడెం, జూలై 25: నగర పరిధిలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం టౌన్-3 ఆపరేషన్ ఏఈఈ బి.తావుర్యా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఎన్ఎస్‌పీ క్యాంపు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ గట్టయ్య సెంటర్ ఫీడర్‌లో ద్వారకా నగర్, బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 27న జేఎల్ఎం అభ్యర్థులకు స్తంభాలు ఎక్కే పరీక్ష

మామిళ్లగూడెం, జూలై 25: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఖమ్మం సర్కిల్ పరిధిలో జూనియన్ లైన్‌మెన్ల ఎంపిక కోసం స్తంభం ఎక్కే పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 27న నిర్వహిస్తున్నామని ఎస్ఈ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు ఖమ్మం ఎస్ఈ కార్యాలయంలో జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థుల 9వ జాబితాను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అభ్యర్థులు పరీక్షలకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## ఇన్‌స్పైర్ మానక్ పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 25: పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో వైజ్ఞానిక సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచడం, విద్యార్థుల్లో సృజనాత్మకత ఆలోచనలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇన్‌స్పైర్ మానక్ అవార్డులను అందజేస్తుందని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌స్పైర్ మానక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 6-10వ తరగతి విద్యార్థుల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లు పంపించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవోకి సూచించారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా విద్యార్థుల ప్రాజెక్ట్‌ల వివరాలకు www.inspireawards-dst-gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రదర్శనకు ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.10వేలు, జాతీయ స్థాయికి ఎంపికైతే రూ.20వేలు అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, డీఎస్‌వో జగదీశ్వర్, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పాలిసెట్ కౌన్సెలింగ్‌కు చివరి అవకాశం

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 25: పాలిసెట్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని విద్యార్థులకు చివరి అవకాశం కల్పించినట్లు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ హెల్ప్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న స్లాట్ బుక్ చేసుకోవాలని, 27, 28 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్స్‌తో పాటు, గతంలో సీటు రాని వారు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చన్నారు.
-ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరే విద్యార్థులకు 26వ తేదీ నుంచి రెండో విడత ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ఉంటుందని కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. 26న స్లాట్ బుకింగ్, 27,28న సర్టిఫికెట్ల పరిశీలన వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం -1 బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు మూసిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ధరావత్ పద్మ**,W/o: **నాగేశ్వరరావు, వయస్సు:** 38సం॥లు, **నివాసం:**ఇ.నెం.4-50/1, గైగొళ్ళపల్లి, లాలీసింగ్ తండ గ్రామం, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నాడు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి బప్పులు చార్జీలు, కైయములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద మూసిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.
**షెడ్యూలు ఆస్తి :** ఖమ్మం జిల్లా అశ్వారావుపేట రిజిస్ట్రారు మరియు కూసుమంచి సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా కూసుమంచి రెవిన్యూ మండలం, గైగొళ్ళపల్లి రెవిన్యూ గ్రామము లాలీసింగ్ తండ గ్రామపంచాయితీ నందు గల RCC Roof House & AC Sheet Roof గృహము, భాళీ స్థల యుక్తముగా గల H.No.4-50/1, (Assessment No. 572) నకు చెందిన భాళీ స్థల విస్తీర్ణము :302-68 చ॥గ॥=253-07 చ॥మీ॥, **డాక్యుమెంట్ నెం. 2156/2024,** నిర్మాణ వైశాల్యం : RCC Roof House 154-00 Sq.Fts & AC Sheet Roof House (Inc Toilet) : 165-17 Sq.Fts మరియు అందు గల సమస్త ఫిక్చర్స్, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, శానిటరీ సహితముగా గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు** : గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర:**డి.సూర్య గారి గృహము, **ఉత్తరము :** డి. మధార్ గారి గృహము, **దక్షిణము :**ఇతరుల భాళీ స్థలము.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలి

### డీఏవో విజయనిర్మల

కొణిజర్ల, జూలై 25 : ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించిన అనంతరం లక్ష రూపాయలలోపు రుణాలు మాఫీ అయిన రైతులకు బ్యాంకులు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయ నిర్మల సూచించారు. గురువారం మండలంలోని తనికెళ్ల గ్రామీణ వికాస బ్యాంకు యూనియన్ బ్యాంకులను ఆమె సందర్శించి ఏఏ బ్యాంకులో ఎంత మంది రైతులకు రుణ మాఫీ అయింది, ఎంతమందికి తిరిగి రుణాలు ఇచ్చారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ ప్రకటించారని, కుటుంబంలో రేషన్‌కార్డు లేని వారు రుణాలు తీసుకున్నారని, వారికి రుణ

బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న డీఏవో

మాఫీ కావడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని డీఏవో తెలిపారు. 2023 డిసెంబర్ 9 నాటికి కటాఫ్ పెడితే బ్యాంకు సిబ్బంది ఆ తర్వాత గడిచిన ఆరు నెలలకు వడ్డీలు చెల్లించమని అడుగుతున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏవో బాలాజీ, ఏఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం చేసిన సీపీఎం నాయకులు

పెనుబల్లి, జూలై 25 : మండలంలోని వీఎం.బంజర రింగ్‌సెంటర్‌లో సీపీఎం, సీఐటీయూ పెనుబల్లి మండల కమిటీల ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు మాట్లాడారు. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి, ఖమ్మం జిల్లాకు తీవ్రమైన నష్టం చేకూర్చిందని, రాష్ట్రం నుంచి 8 మంది పార్లమెంట్ సభ్యులు ఉన్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు మొండిచేయి చూపిందని, సన్న, చిన్నకారు రైతాంగానికి ఎరువులు సబ్సిడీలు ఎత్తివేశారని, రైతే దేశానికి వెన్నెముఖ అని చెప్పే పాలకులు ఆ రైతునే మర్చిపోయారని అన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో రైల్వే కోర్‌లైన్‌ను ప్రతి

కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పాదన కనీస ప్రస్తావన చేయలేదన్నారు. దేశంలో 20 కుటుంబాలకే దేశ సంపదను మొత్తం కట్టబెట్టే పరిస్థితిలో నరేంద్రమోదీ, అమిత్‌షా, నిర్మలాసీతారామన్ వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మిద్దె స్వామి, నిమ్మల వీరయ్య, మల్లెల నరసింహారావు, బజ్జురు మురళీకృష్ణ, చింత చంటబ్బాయి, వి.శ్రీనివాసరావు, దుర్గమ్మ, మరీదు వాసు, దర్గయ్య, బుర్రి సీతారాములు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు పూడ్చివేత

చింతకాని, జూలై 25: మండల పరిధిలో రాఘవాపురం గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రామానికి చెందిన యువత పూడ్చివేశారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. ఎస్సై నాగుల్‌మీరా సూచనల మేరకు తాత్కాలికంగా మట్టి, ఇసుక, కంకరతో గుంతలను పూడ్చివేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అబ్బూరి మహేష్, దొబ్బల జగదీష్, మామిళ్ళపల్లి రాజేష్, సుదర్శన్, కోటి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**మధిరలో...**

మధిర, జూలై 25: సీపీఐ నాయకులు పట్టణంలో స్వచ్ఛందంగా గుంతలను జేసీబీతో గురువారం మరమ్మతులు చేశారు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పైప్‌లైన్ల కోసం రోడ్డును తవ్వి నిర్లక్ష్యంగా వదిలి వేసిన గుంతలను సీపీఐ నాయకులు బెజవాడ రవిబాబు మరమ్మతులు చేపట్టారు. కాంట్రాక్టర్ మధిర ఆర్‌వీ.కాంప్లెక్స్ ఎదురుగా మిషన్ భగీరథ పైపుల కోసం గుంతలను తవ్వించి నిర్లక్ష్యంగా వదిలిపెట్టారు. ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండడంతో గమనించిన సీపీఐ నాయకులు గుంతలకు మరమ్మతులు నిర్వహించారు.

## అధికారులు, ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

ఖమ్మం సిటీ, జులై 25: ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అక్కడ పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశానుసారం గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ యంత్రాంగం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ దిశగా హెల్త్ ప్రొఫైల్ రూపకల్పనలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన రిజిస్ట్రేషన్ కేంద్రాలు, శాంపిల్ కలెక్షన్స్ కేంద్రాలు, ఉద్యోగులను పరీక్షించే నిమిత్తం అవసరమైన వైద్యులను అందుబాటులో ఉంచారు. అక్కడకు వచ్చిన ప్రతి ఉద్యోగిని వైద్యులు పరీక్షించి వారి మెడికల్ హిస్టరీ తెలుసుకుని అవసరమైన వైద్య పరీక్షలు చేశారు. సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్), హిమోగ్లోబిన్, రక్త కణాల సంఖ్య, తెల్ల రక్త కణాల వివరాలను, ఆర్‌బీఎస్ (షుగర్ స్థాయి), ఎల్ఎఫ్‌టీ (కాలేయ పనితీరు), ఆర్ఎఫ్‌టీ (కిడ్నీల పనితీరు), థైరాయిడ్ ప్రొఫైల్, లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ, కాల్షియం, బీ 12, డీ 3 వంటి పరీక్షలు చేశారు. ఫలితాల వివరాలను వారి మొబైల్ ఫోన్‌కు పంపించి, పాటించాల్సిన డైట్ వివరాలు, చేయాల్సిన మెడిటేషన్, వాడాల్సిన మందుల వివరాలను సంబంధిత వైద్య నిపుణులతో సూచించనున్నారు. ప్రత్యేక వైద్య శిబిరానికి 287 మంది పురుష, 140 మంది మహిళా ఉద్యోగులు హాజరయ్యారు. వీరిలో 102 మందికి మధుమేహం, బీపీ, 85 మందికి ఈసీజీ

కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పరీక్షలు నిర్వహించారు. మరో 346 మందికి వివిధ వైద్య పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించారు. కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ స్వయంగా పర్యవేక్షించడంతోపాటు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజలకు సేవలు అందించే ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ మాలతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్, వివిధ శాఖల అధికారులు, జిల్లా ఆసుపత్రి ఫిజీషియన్లు, గైనకాలజిస్ట్‌లు, వివిధ విభాగాల స్పెషలిస్ట్‌లు, వైద్యాధికారులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పామాయిల్ సాగు సబ్సిడీ రైతుల అకౌంట్‌కు జమచేయాలి

కొణిజర్ల, జూలై 25 : పామాయిల్ సాగు సబ్సిడీ రైతుల బ్యాంకు అకౌంట్లకు జమ చేయాలని గురువారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీ డబ్బులు విడుదల చేసిన రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా ఉండడం సబబు కాదన్నారు. కొణిజర్ల, ఖమ్మంఅర్బన్, ఏన్కూరు మండలాల్లో పామాయిల్ తోటలు ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి పలు సూచనలు చేయాలని, కొందరు రైతులు తాము సాగుచేసిన తోటలు కాపుకి రావడం లేదని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

అధికారులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

చింతనిప్పు చలపతిరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, ఎస్.నవీన్‌రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మందనపు రవీంద్ర, వేములపల్లి సుదీర్, నల్లమోతు శ్రీనివాసరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

## కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 25: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి(అటానమస్) హోదా లభించినట్లు కళాశాల చైర్మన్ ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, కరస్పాండెంట్ కొటా అప్పిరెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలో అటానమస్ పొందిన తొలి ప్రైవేట్ డిగ్రీ కళాశాలని, 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఐదు సంవత్సరాల పాటు అటానమస్ హోదా కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. 1991లో కళాశాలను స్థాపించగా 2021లో న్యాక్

ఉత్తర్వులను ప్రదర్శిస్తున్న చైర్మన్, కరస్పాండెంట్

గ్రేడింగ్ సాధించిందన్నారు. కళాశాలలో 2300 మంది విద్యార్థులు ఉండగా త్వరలో నూతన కోర్సులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారావు, కృష్ణమూర్తి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

రఘునాథపాలెం, జూలై 25: బైక్ ఫైనాన్స్‌లో పనిచేస్తూ సంస్థకు సంబంధించిన వాహనాలను అమ్ముకున్న వ్యక్తిపై ఖానాపురం హవేలీ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన గుండా సాయి జయంతి అసోసియేట్స్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కాగా సంస్థకు చెందిన 45 బైక్‌లను రికవరీ చేసి మరో ప్రైవేటు సంస్థకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న జయంతి అసోసియేట్స్ పోలీసులను ఆశ్రయించింది. జల్సాలకు అలవాటు పడిన సాయి బైక్‌లను అమ్ముకుని సంస్థను మోసగించినట్లు గుర్తించి ఫిర్యాదు చేసింది. దీనిపై గుండా సాయి నుంచి రూ.10 లక్షలు, 45బైక్‌లను స్వాధీన పర్చుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎర్రుపాలెం, జూలై 25: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీ.సురేందర్ తెలిపారు. ఎంపీపీ దేవరకొండ శిరీష అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## వెదజల్లే పద్ధతిలో రైతుకు ఖర్చు ఆదా

కూసుమంచి, జూలై 25: రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఎకరాకు రూ.7 నుంచి 8 వేల వరకు ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి రామడుగు వాణి అన్నారు. మండలంలోని జక్కేపల్లిలో రామిని అనంతరామయ్యకు చెందిన పొలంలో గురువారం నేరుగా వెదజల్లే పద్ధతిని చేపట్టారు. కార్యక్రమంలో రైతు అనంతరామయ్య, ఏఈవో సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చింతకాని, జూలై 25: మండలంలోని రామకృష్ణాపురం అడ్డరోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పందిళ్ళపల్లికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పందిళ్లపల్లికి చెందిన నాగిరెడ్డి పాలు విక్రయం కోసం రోజూ ఖమ్మం వెళ్లి వస్తాడు. ఈ నేపథ్యంలో గురువారం పాలు తీసుకొని ఖమ్మం వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగిరెడ్డికి గాయాలు కాగా స్థానికులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు దవాఖానాలో చేర్పించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాలేరుకు సాగర్ నీరు నిలిపివేత

కూసుమంచి, జూలై 25: గత శుక్రవారం నాగార్జున సాగర్ నుంచి ఎడమ కాలువ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు విడుదల చేసిన నీటిని గురువారం నిలిపివేశారు. సాగర్ నుంచి 1.60 టీఎంసీల నీటిని వదిలారు. పాలేరు జలాశయం నీటిమట్టం కేవలం 5.5 అడుగులు మాత్రమే ఉండడంతో జిల్లాలో తాగునీటి అవసరాల కోసం నీరు వదిలారు. ప్రస్తుతం సాగర్ నుంచి వస్తున్న నీటితో పాలేరు నీటిమట్టం 16.5 అడుగులకు చేరుకుంది.

## కేసు నమోదు

కారేపల్లి, జూలై 25 : మండలంలోని మేకలతండా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేకలతండకు చెందిన సైదులునాయక్‌కు పొలంలో పాము కాటు వేయడంతో తన ద్విచక్ర వాహనంపై తన దగ్గర పనిచేస్తున్న చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన సాముల కశ్చప్‌ను తీసుకొని ఆసుపత్రికి వెళ్తుండగా మేకలతండా శ్మశానవాటిక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారి తలకు బలమైన గాయాలు కావడంతో సైదులునాయక్ అక్కడికక్కడే మృతిచెందగా కశ్చప్‌ను వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ మేరకు మృతుడు సైదులునాయక్ తండ్రి జాటోత్ వీరన్న ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కూసుమంచి, జూలై 25: మండలంలోని బోడియాతండాలో అక్రమంగా నిల్వ ఉంచిన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగలితండా రేషన్ డీలర్‌కు అప్పగించారు.

## వైరాలో చోరీ

వైరాటౌన్, జూలై 25 : మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు సంత బజార్‌లో రంగా సత్యనారాయణ నివాసంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్ కుమార్తె ఇంటికి వెళ్లడంతో అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు రూ.20లక్షలు విలువైన 20 కేజీల వెండి సామగ్రి, వస్తువులను ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటి ప్రక్కన ఉన్న స్థానికులు ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండడం చూసి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వైరాకు చేరుకున్న సత్యనారాయణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై వేలిముద్ర నిపుణులతో పంచనామా నిర్వహించారు.

## రైతులకు అవగాహన

కొణిజర్ల, జూలై 25 : చెరువుల కింద వరినాట్లు వేసే రైతులకు ఏవో బాలాజీ గురువారం పలు సూచనలు చేశారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూమిలో కార్బన్ శాతం పెరిగి నాటు వేసిన తర్వాత ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. నాటు తర్వాత 3 నుంచి 5 రోజుల లోపు కలుపు మందు పిచికారీ చేసుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడు ఎక్కువ పిలకలు వచ్చి మంచి దిగుబడి వస్తుందన్నారు.

## పల్లె దవాఖానకు ఫ్రిజ్ వితరణ

కారేపల్లి, జూలై 25 : మండలంలోని విశ్వనాథపల్లి పల్లె దవాఖానాకు దాతలు గురువారం ఫ్రిజ్ వితరణ చేశారు. విశ్వనాథపల్లికి చెందిన వడ్డే వెంకటమ్మ, తులిశమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, కూతుర్లు కలిసి ఫ్రిజ్‌ను మండల వైద్యాధికారి డాక్టర్ బీ.సురేశ్‌కు అందజేశారు.

## పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

తిరుమలాయపాలెం, జూలై 25: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఎంపీడీవో శిలార్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు. జూపెడలో పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో సూర్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 28న ఖమ్మంలో రాయల సంతాపసభ

సత్తుపల్లి, జూలై 25 : ఈ నెల 28న ఖమ్మంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ నాయకుడు, అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ సంతాపసభను విజయవంతం చేయాలని సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో నీలం రామచంద్రయ్యభవనంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

## బాధిత కుటుంబానికి వితరణ

సత్తుపల్లి, జూలై 25 : పట్టణ శివారులోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న వీ.మోహన్‌రావు అనే అధ్యాపకుడి భార్